## క్లుప్తంగా

### ద్విచక్ర వాహనాల పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో దివ్యాంగులకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు ద్విచక్ర వాహనాలను పంపిణీ చేశారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, దివ్యాంగుల పింఛన్‌ను పెంచడమే కాకుండా వారికి ట్రైసైకిళ్లు, బ్యాటరీ వాహనాలు ఇచ్చిన ఘనత తమదే అన్నారు. రానున్న రోజుల్లో దివ్యాంగుల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షకీలా దస్తగిరి, కమిషనర్ వెంకయ్యలతో పాటు పాల్గొన్నారు.

### సభను జయప్రదం చేయాలి



యడ్లపాడు: ఎస్సీ వర్గీకరణ సాధనకు జరిగే సభను జయప్రదం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ పల్నాడు జిల్లా కన్వీనర్ కనుమూరి కోటేశ్వరరావు మాదిగ కోరారు. మండలంలోని సొలస ఎస్సీకాలనీలో సోమవారం స్థానికులతో సమావేశమయ్యారు. నరసరావుపేట పట్టణంలో జులై 8వ తేదీన ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఈ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ఎంఆర్‌పీఎస్ నాయకులు మందా కృష్ణమాదిగ హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలోని మాదిగలంతా ఈ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు క్రాంతి, చిరుగురి నాగరాజు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలల బలోపేతానికి సహకారం అవసరం

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం తప్పనిసరిగా ఉండాలని ఎంఈవో పుసులూరి లలితాకుమారి కోరారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో నూతన విద్యాసంవత్సరం పురస్కరించుకుని విద్యార్థుల తల్లిదండ్రులు,పేరెంట్ కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నూతన విద్యావిధానం ద్వారా మంచి మార్పు చోటు చేసుకుందన్నారు. ప్రైవేటు స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్నీ రకాల వసతులు, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం తదితర సౌకర్యాలు పారదర్శకంగా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు క్రమం తప్పకుండా తమ పిల్లల విద్యపై నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు బోడ్డుపాటి విజయలక్ష్మిలను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు బీవీ నాగేశ్వరరావు, భువనేశ్వరీ దేవి, నిర్మలకుమారి పాల్గొన్నారు.

### నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

వినుకొండ(నూజెండ్ల): స్థానిక పురపాలక సంఘం నేటి ఉదయం 11 గంటలకు సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ దస్తగిరి తెలిపారు. ఈ సమావేశంలో వినుకొండ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి 32 అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

### జిల్లాలో స్వల్ప వర్షం

కొరిటిపాడు (గుంటూరు): జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా పొన్నూరు మండలంలో 5.8 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా గుంటూరు తూర్పులో 0.4 మి.మీ వర్షం పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. కాకుమాను మండలంలో 3.4 మి.మీ., దుగ్గిరాల 2.8, పెదనందిపాడు 2.8, చేబ్రోలు 1.2, వట్టిచెరుకూరు 1.2, గుంటూరు పశ్చిమలో 0.6 మి.మీ చొప్పున వర్షం పడింది.

### గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

చిలకలూరిపేట టౌన్: గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడలోని నిడమానూరు ప్రాంతానికి చెందిన గంధం వెంకటేశ్వరరావు (61) ఓ పాల డైరీలో సొంత వాహనమైన లారీలో పాలను డెలవరీ చేస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం పాలతో తన వాహనంలో చిత్తూరు బయలు దేరాడు. పట్టణంలోని ఎన్‌ఆర్‌టీ సెంటర్ సమీపంలో రాత్రి లారీని పార్క్ చేసి, అందులో నిద్రపోయాడు. నిద్రలోనే గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయాడు. సోమవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు ఏసుబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# జగనన్న సురక్షతో వంద శాతం సంక్షేమం

**ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు**



వినుకొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, పక్కన మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు

వినుకొండ (నూజెండ్ల): అర్హులైన వారికి వంద శాతం సంక్షేమ పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక బొల్లా కన్వెన్షన్ హాల్‌లో జగనన్న సురక్ష కార్యక్రమం పై ఐదు మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అధికారులకు, నాయకులకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుసంధానంగా జగనన్న సురక్ష కార్యక్రమం అన్ని సచివాలయాల పరిధిలో నెలరోజుల పాటు కొనసాగుతుందని, ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. అర్హత ఉండి చిన్నచిన్న కారణాలతో సంక్షేమ పథకాలు దూరమైన వారిని వారం రోజుల పాటు ముందుగా గుర్తించి ఉచితంగా సేవలు అందించడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, ఎంపీపీలు మేడం జయరామిరెడ్డి, సుహాసిని అనిల్‌కుమార్, జెడ్పీటీసీలు బీబ్లీబాయి కృష్ణానాయక్, చౌడయ్య, జడ్డా సుబ్బులు రామయ్య, మండల కన్వీనర్ దండు చెన్నయ్య, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, సర్పంచ్‌లు కోపెల దేవరాజ్, మండల నాయకులు బీమని అంకారావు, తహసీల్దార్‌లు కిరణ్‌కుమార్, మధుబాబు, సుధీర్, ఎంపీడీవోలు జిలానీ బాషా, వీరభద్రాచారిలతో పాటు ఐదు మండలాల నాయకులు, అధికారులు, గ్రామసచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

**యడ్లపాడులో జగనన్న సురక్ష సర్వే**

యడ్లపాడు: మండలంలోని పలు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ముమ్మరంగా సర్వే కొనసాగుతుంది. గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తమకు నిర్దేశించిన గ్రామ సచివాలయం పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యల్ని స్వయంగా తెలుసుకుని వాటిని సచివాలయం సిబ్బంది దృష్టికి తీసుకెళ్తున్నారు. సర్వేకు వెళ్లిన సమయంలో కుటుంబ యజమానుల బయోమెట్రిక్‌ను సైతం తీసుకుంటున్నారు. సోమవారం యడ్లపాడు -2, కారుచోల సచివాలయాల పరిధిలో వలంటీర్లు సర్వేను కొనసాగించారు. ఈ సర్వే ప్రక్రియ నిర్వహణను మండలస్థాయి అధికారుల బృందాలు సైతం పర్యవేక్షిస్తున్నాయి. యడ్లపాడు-2 సర్వేను గ్రామంలో ఎస్సీకాలనీ (పైపల్లె)లో ఎంపీడీవో వై.హనుమారెడ్డి బృందం పరిశీలించగా, ఎస్టీ కాలనీ, సవళ్లు, సుగాలీ కాలనీ ప్రాంతాలను తహసీల్దార్ ఎన్.నాగమల్లేశ్వరరావు బృందం పరిశీలించింది. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బి.వరూధిని, పంచాయతీ కార్యదర్శి శశికళ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**అర్హులందరికీ సంక్షేమం**

చిలకలూరిపేట: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించటమే జగనన్న సురక్ష కార్యక్రమ లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణంలోని పలు సచివాలయాల పరిధిలోని ప్రాంతాలను పుడా వైస్ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ అధికారులతో కలసి సోమవారం పరిశీలించారు. అనంతరం పురపాలక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయ పరిధిలోని వలంటీర్లు వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. ఈ సర్వే లో అర్హత ఉండి సంక్షేమ పథకాలు వర్తించని వారిని వలంటీర్లు గుర్తించి, పరిష్కారానికి కావల్సిన పత్రాలను సేకరించి అవి సంబంధిత సచివాలయంలో అందజేయడం జరుగుతుందన్నారు. సచివాలయంలో వివరాలు అందించి వారి టోకెట్ నంబర్ తీసుకొని అర్జీదారుని ఇంటికి వెళ్లి టోకెన్ అందజేస్తారని తెలిపారు. వలంటీర్ వెళ్లినప్పుడు ఇంటికి తాళం వేసి ఉంటే, వారు ఉండే సమయంలో మరలా వెళ్లి వివరాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జులై ఒకటో తేదీ నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సంబంధిత సచివాలయ పరిధిలో క్యాంపు నిర్వహించే తేదీని ముందే ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఏ ధ్రువీకరణ పత్రం లేక, ఏ సంక్షేమ పథకం రావడం లేదో తెలుసుకొని వారికి సంబంధిత ధ్రువీకరణ పత్రం జారీ చేయడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. వలంటీర్లు ప్రభుత్వ పథకాలు, ధ్రువీకరణ పత్రం సంబంధ సమస్యలు ఉన్న వారందరినీ సమావేశం జరిగే స్థలానికి తీసుకురావాల్సి ఉంటుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేసేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్, మెంబర్ డి.నాగేశ్వరరావు, కౌన్సిలర్లు బేరింగ్ మౌలాలి, షేక్ కరిముల్లా, మున్సిపల్ డీఈఈ తోట వెంకట రమణ పాల్గొన్నారు.

**క్షేత్రస్థాయిలో జగనన్న సురక్ష సర్వే నిర్వహించాలి**

నాదెండ్ల: సంకురాత్రిపాడు గ్రామంలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను సోమవారం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాదెండ్ల మండల ప్రత్యేకాధికారి బీజే బెన్ని, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్‌తో పాటూ మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెలాఖరువరకూ సర్వే కార్యక్రమం వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లు కలిసి ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల అమలుకు అవసరమైన లబ్ధిదారులకు ఎలాంటి ధ్రువపత్రాలు కావాలో అడిగి తెలుసుకోవాలన్నారు. వాటికి అవసరమైన డాక్యుమెంట్లను తీసుకోవాలన్నారు.



యడ్లపాడు ఎస్సీకాలనీలో వలంటీర్లతో ప్రజా సమస్యల్ని అడుగుతున్న ఎంపీడీవో హనుమారెడ్డి



చిలకలూరిపేటలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పుడా వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి



నాదెండ్ల సచివాలయంలో మాట్లాడుతున్న బెన్నీ

### తుదిదశకు చేరిన రీసర్వే పనులు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు, శానంపూడి, పోట్లూరు, పిచికలపాలెం తదితర రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పనులు తుదిదశకు చేరినట్లు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ రీసర్వే పనుల్లో రోవర్ యంత్ర పరికరాలు ద్వారా రైతుల సమక్షంలో భూములు కొలతలు తీశామన్నారు. రికార్డు పనులు పూర్తి అయిన రెవెన్యూ గ్రామాల్లోని రైతులకు ఫామ్ 9 (2) నోటీసులు రెవెన్యూ అధికారులు నేరుగా రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా వేల్పూరు రెవెన్యూ గ్రామంలో 2160 మంది రైతులకు నోటీసులు ఇవ్వాల్సి ఉండగా నేటి వరకు 1450 మంది రైతులకు అందజేశామన్నారు. మిగిలిన రైతులు భూములకు సంబంధించి సమగ్ర ఆధారాలు చూపించలేకపోవటం, వివిధ ప్రాంతాల్లో కొందరు ఉన్నారని అర్హత కలిగిన రైతులను గుర్తించి త్వరితగతిన నూరు శాతం పంపిణీ చేస్తామన్నారు. పిచికలపాలెంలో 1200 మంది రైతులకు గాను 600 మంది రైతులకు అందజేశామన్నారు. పోట్లూరు రెవెన్యూ గ్రామంలో 2 వేల మంది రైతులకు 1750 రైతులకు ఫామ్ 9(2) నోటీసులు అందజేశామన్నారు. నోటీసులు తీసుకున్న రైతులు తమ భూములకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉన్నపక్షంలో సమగ్ర ఆధారాలతో రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, ఆర్‌ఐ చంద్ర బాబు ఉన్నారు.

### పచ్చిరొట్ట పైరుతో భూమికి మేలు

నరసరావుపేట రూరల్: పచ్చిరొట్టపైరుతో భూసారం పెరగడంతో పాటు సూక్ష్మపోషకాలు అందిచవచ్చని జిల్లా వనరుల కేంద్ర, వ్యవసాయ ఉపసంచాలకులు ఎం.శివకుమారి తెలిపారు. మండలంలోని పాలపాడు గ్రామంలో సోమవారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన వ్యవసాయ శాఖ ఉపసంచాలకులు శివకుమారి మాట్లాడుతూ పచ్చిరొట్ట పైర్లైన జీలుగ, జనుము, పిల్లిపెసర, పెసర, మినుము వేసుకొని పూతదశలో నేలలో కలియదున్నాలని తెలిపారు. దీని వలన భూసారం పెరగడం ద్వారా ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులలో అవగాహన లోపం వలన కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా వేస్తున్నారని వరినాటు వేసిన 15 రోజుల లోపల కాంప్లెక్స్ ఎరువులను వాడాలని తెలిపారు. పొలం ఉన్న రైతులు కౌలు రైతులు కార్డులు పొందేలా సహకరించాలన్నారు. కేవలం పంట మీద మాత్రమే కౌలు రైతులకు హక్కు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ మస్తానమ్మ, జిల్లా వనరుల కేంద్రం ఏఓ ప్రవీణ్, గ్రామ సర్పంచ్ సైకం సత్యనారాయణ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకుడు బోస్, రైతులు పాల్గొన్నారు.

## మత్తుపదార్థాల వినియోగ వ్యతిరేక దినోత్సవం

వినుకొండ(నూజెండ్ల): నవజీవన్ బాల భవన్ విజయవాడ వారి సహకారంతో స్థానిక స్వచ్ఛంద సంస్థ హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మత్తుపదార్థాల వినియోగ వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు మత్తు పదార్థాలకు బానిసలై అనారోగ్యపాలై తమ నిండు జీవితాన్ని ముందుగానే ముగించి తమ కుటుంబాలకు తీరని శోకం కలిగిస్తున్నారని అన్నారు. యువత ఈ మత్తుపదార్థాలకు ఎక్కువగా బానిసలై తమ తల్లిదండ్రుల ఆశలను నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు అనంతరం పట్టణంలో మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా నినాదాలు, ర్యాలీ, ప్రతిజ్ఞ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక ప్రభుత్వం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తుపదార్థాలు, మానవ అక్రమ రవాణా మీద అవగాహన కల్పించి వ్యాసరచన, సామూహిక చర్యలు, డ్రాయింగ్, డిబెట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ షకీలా, ప్రిన్సిపాల్ మోహన్ రావు, తెలుగు అధ్యాపకులు సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి, సంస్థ ప్రతినిధి విద్యారావ్, సిబ్బంది ఆశ, సంధ్య, రమేష్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

**ఎస్ఈబీ ఆధ్వర్యంలో....**

అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వినుకొండ ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్, సిబ్బంది కలిసి వినుకొండ గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనం**

నాదెండ్ల: మాదక ద్రవ్యాల వినియోగంతో వ్యక్తిగత జీవితాలు చితికిపోవటంతో పాటూ సమాజంలో చులకన భావం తలెత్తుతుందని ఎస్సై ఆవుల భాస్కర్ చెప్పారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం పారిశ్రామిక కేంద్రం గణపవరం గ్రామంలో పోలీసులు స్థానికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై భాస్కర్ మాట్లాడుతూ, గంజాయి, గుట్కా, పాన్‌పరాగ్‌తో పాటూ ప్రమాదకర రసాయనాలతో కూడిన డ్రగ్స్ సమాజంలో చాపకింద నీరులా విస్తరిస్తున్నాయన్నారు. వీటి వినియోగంతో ఆరోగ్యం క్షీణించటమే కాకుండా ఆర్థికంగా కూడా కుటుంబాలకు భారమౌతుందన్నారు. వలస కార్మికులు మాదక ద్రవ్యాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు.

**గణపవరం జిల్లా పరిషత్ హైస్కూలులో...**

గణపవరం కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. సైన్స్ ఉపాధ్యాయుడు రత్నరాజు మాట్లాడుతూ, ప్రజలు మత్తు పదార్థాలకు బానిసలయ్యారంటే ఆ సమాజం తిరోగమనంలో పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో పీడీ వేణుగోపాల్, పీఈటీ జాస్తి శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి**

నరసరావుపేట ఈస్ట్: యువతను నిర్వీర్యం చేసే మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య తెలిపారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఎన్‌సీసీ విభాగం మేజర్ బి.ఎస్.ఆర్.కె.రాజు ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. ర్యాలీని ప్రారంభించిన ప్రిన్సిపల్ డాక్టర్ మల్లయ్య మాట్లాడుతూ, దేశాభివృద్ధికి మూల స్థంభాలైన యువత మాదక ద్రవ్యాల మత్తులో చిత్తవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిగరెట్, గుట్కా, ఇతర పొగాకు ఉత్పత్తులతో పాటు గంజాయి, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఇటువంటి మత్తు పదార్థాలను ఎక్కడ విక్రయించినా బాధ్యత గల పౌరులుగా పోలీసులకు తెలియచేసి వాటి వినియోగాన్ని అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, ఎన్‌సీసీ 23 ఆంధ్రా బెటాలియన్ హవల్దార్ పప్పురామ్‌సింగ్, ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

**త్యజిస్తేనే ఆరోగ్యవంతమైన సమాజం**

యడ్లపాడు: మాదక ద్రవ్యాల వినియోగాన్ని త్యజిస్తేనే సమాజం ఆరోగ్యవంతంగా..శాంతియుతంగా ఉంటుందని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఎం.వాసుదేవరావు చెప్పారు. మండలంలోని తిమ్మాపురం గ్రామ సచివాలయంలో డ్రగ్స్ వద్దు ఆరోగ్యం ముద్దు అనే అంశంపై అవగాహన కార్యక్రమం సోమవారం జరిగింది. 'ప్రపంచ మాదక ద్రవ్యాల దుర్వినియోగం.. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం ఎం.నాగలక్ష్మి, జోనల్ సూపర్‌వైజర్ బి.నాగేశ్వరరావు, లింకు వర్కర్ యస్ ఆదిలక్ష్మి, ఆశ కార్యకర్తలు లక్ష్మి, ఆశ పాల్గొన్నారు.



వినుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్



గణపవరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై భాస్కర్, పోలీసు సిబ్బంది



నరసరావుపేటలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్స్

## కుష్ఠు వ్యాధి నివారణపై ఇంటింటి సర్వే

వినుకొండటౌన్: కుష్ఠువ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వేను, వినుకొండ రూరల్ ఏనుగుపాలెం పీహెచ్‌సీ పరిధిలోని విఠంరాజుపల్లిలో సోమవారం ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకట రామిరెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి లక్షణాలు కలిగిన వ్యక్తులను ప్రారంభ దశలో గుర్తించి, ప్రభుత్వం అందజేస్తున్న చికిత్సలను వారికి తెలిచేయించాలని, తద్వారా వ్యాధి నివారణ అవుతుందన్నారు. వచ్చే నెల 16వ తేదీ వరకు ఈ ఇంటింటి సర్వే నిర్వహించడం జరుగుతుందని, లక్షణాలు ఉన్న వారు వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ అధికారి వి.రాంనాయక్, డీపీఎంఓ ప్రభాకర్‌రెడ్డి, సీహెచ్‌వో నాగేశ్వరమ్మ, హెచ్‌ఈవో వి.నాగేశ్వరరావు, సూపర్‌వైజర్స్ పాల్గొన్నారు.



సర్వేను ప్రారంభిస్తున్న ఎంపీపీ జయశ్రీ వెంకటరామిరెడ్డి

## విత్తన ఎంపికలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

**ప్రధానంగా మిరప సాగుకు విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి**

బొల్లాపల్లి: నైరుతి రుతుపవనాల రాకతో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు సాగుకు పొలాలను సన్నద్ధం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో విత్తన ఎంపికలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి ఎ. అంకారావు తెలిపారు. మండలంలోని వడ్డెంగుంట రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సాగుకు ముందు చేపట్టాల్సిన వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు సూచనలు చేశారు. ప్రధానంగా మండలంలో మిరప సాగు అధికమని తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది మరింత సాగు చేసే అవకాశం ఉందని, పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విత్తన ఎంపికలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, విత్తన కొనుగోలులో బిల్లులు తప్పని సరి పొందాలని సూచించారు. షేడ్ నెట్స్ యజమానులు నాణ్యమైన ప్రమాణాలతో విత్తనాలు ఎంపిక చేసుకొని మిరప నారు పెంచాలన్నారు. నాసిరకం విత్తన విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలో రావులాపురం, రేమిడిచర్ల, మర్రిపాలెం, వెల్లటూరు, మేళ్ళవాగు గ్రామాల్లో ఎనిమిది షాపులు మాత్రమే విత్తనాలు విక్రయిస్తున్నాయని తెలిపారు. ప్రైవేటు వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని తెలిపారు. ప్రధానంగా షేడ్ నెట్స్ యజమానులు విత్తన ఎంపిక ప్రక్రియ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈవోలను సత్కరించిన ఉపాధ్యాయ సంఘనేతలు



యడ్లపాడు ఎమ్మార్సీ వద్ద ఎంఈవోలను సత్కరించిన ఉపాధ్యాయ సంఘాల నేతలు

యడ్లపాడు: విద్యాభివృద్ధికి ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని యడ్లపాడు ఎంఈవో -2 ఎస్ అరుణకుమారి చెప్పారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంఈవోను సోమవారం పలు ఉపాధ్యాయ సంఘాలకు చెందిన నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రం వద్ద కలిసి ఎంఈవో -2 అరుణకుమారితో పాటు మండల ఇన్‌చార్జ్ ఎంఈవో ఐ ఆంజనేయులును శాలువాలతో సత్కరించి స్వాగతించారు. అనంతరం వారు విద్యార్థి సంఘ నేతలతో మాట్లాడుతూ పాఠశాలల్లోని అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ... విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తూ జిల్లాలోనే మండలాన్ని ప్రథమస్థానంలో ఉండేలా సహకారం అందించాలని కోరారు. అందుకు అవసరమైన పలు సలహాలు, సూచన్లు చేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ బి.సంపత్‌బాబు, పీఆర్‌టీయూ నాయకులు కె.సంపూర్ణ రావు, ఎన్టీయూ నాయకులు గుప్తా, ఎం.ప్రసన్నకుమార్, యూటీఎఫ్ మధు ఉన్నారు.

## విగ్రహ ఏర్పాటుకు చొరవ తీసుకోండి

**ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని కోరిన ఓబీసీ సంఘ నేత**



ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని దుశ్శాలువతో సత్కరించిన అంగిరేకుల వరప్రసాదు యాదవ్

నరసరావుపేట: బీహార్ మాజీ ముఖ్యమంత్రి, బీసీ రిజర్వేషన్ల పితామహుడైన బీపీ మండల్ విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేసేందుకు అన్నీ అనుమతులు మంజూరు చేసేందుకు చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డిని జాతీయ ఓబీసీ సంఘం అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గోపిరెడ్డిని పలువురు బీసీ నాయకులతో వరప్రసాద్ యాదవ్ కలిశారు. దేశవ్యాప్తంగా ఓబీసీ వర్గాల కోసం తన జీవితాన్ని త్యాగంచేసి కేంద్ర సర్వీసులలో 27 శాతం రిజర్వేషన్లు కల్పనకు కృషి చేసిన మహనీయుడైన మండల్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి వారిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం జిల్లా కేంద్రంలో విగ్రహానికి స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే నూతనంగా జిల్లా కేంద్రంలో మహాత్మా జ్యోతిరావు, సావిత్రి బాయ్ పూలే భవనం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించి రూ.కోటికి పైగా నిధులను సమీకరించేందుకు సహకరించిన ఎమ్మెల్యే గోపిరెడ్డికి కృతజ్ఞతలు తెలియచేశారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులు పసుపులేటి మనోజ్ కుమార్, ఓబీసీ సంఘం నాయకులు బత్తుల వెంకటేష్, బీసీ ఎస్సీ,ఎస్టీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మనోజ్ పాల్గొన్నారు.

## పోషకాహారం పంపిణీ

శావల్యాపురం: వచ్చే నెల నుంచి అన్నీ అంగన్‌వాడీ సెంటర్లు నుంచి గర్భిణులు, బాలింతలకు పోషకాహారం పంపిణీ చేయనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత సోమవారం తెలిపారు. అర్హత కలిగిన గర్భిణీ, బాలింతలకు ఒక్కొక్కరికీ 3 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, 450 గ్రాముల అయిల్, 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్యాకెట్లు అంగన్‌వాడీ సెంటర్లు కార్యకర్తల పర్యవేక్షణలో పారదర్శకంగా పంపిణీ చేస్తామన్నారు. మండలంలోని మతుకుమల్లి గ్రామంలో అత్యధికంగా రక్తహీనత బాధపడే వారు ఉన్నట్లు గుర్తించామని ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి వారందరూ రక్తహీనత నియంత్రణ దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.